

# పద్మ నన్ను క్షమించింది!

శానమల జయరామరెడ్డి

ఈ కాలంలో ఉద్యోగం రాకడ. కరెంటు పోకడ ఎవరికి తెలుస్తాయి గనుక ? ఉన్నట్లుండి ఒకానొక శుభదినాన ఆశించని చోటనించి ఆర్డరు వచ్చింది నాకు. ఆ ఉద్యోగానికి నేనెప్పుడు దరఖాస్తు పెట్టానో నాకే గుర్తులేదు .... సుమతి ఛాటియా హాస్పిటల్ ఫర్ ఉమెన్— బంజారా హిల్స్ – హైదరాబాద్–జీతం, అలవెన్సులు అన్నీ కలిపి నెలకు ఆరు వందల రూపాయలు. ఇష్టమైతే వెంటనే వచ్చి చేరమని రాశారు. బడ్జెట్ ముందు నిత్యావసర వస్తువుల్లాగా ఉద్యోగాలు కరువైన ఈ కాలంలో ఇష్టపడక చేసేదేముంది ? బ్రహ్మచారిని గనుక ఓ మూడు వందలు నాకింద ఖర్చైనా "కనీసం మూడు వందలైనా ఇంటికి పంపవచ్చు" నిముషం కూడా ఆలస్యం చెయ్యకుండా పెట్టే బేడా సర్దుకొని రైలెక్కేశాను.

హాస్పిటలకు దగ్గర్లోనే జాగీరుపోగొట్టుకొన్న ఒక ముస్లిం జాగీర్దారు బంగ్లాలో రెండుగదులు అద్దెకు తీసుకొన్నాను. సంపాదన లేకపోయినా పాత అలవాట్లుమాత్రం మానుకోలేని ఆ మాజీ జాగీర్దారు ఎప్పుడూ గుడుంబా నిషాలో మునిగి తేలుతూ ఉంటాడు. అతని పెళ్ళానికి మంచితనమంత ఘోషా. ఎప్పుడోగాని కనిపించేది కాదు. అతనికి పెళ్ళిచెయ్యలేక చదివించిన ఆడపిల్లలు ఇద్దరున్నారు. ఏవో చిన్న ఉద్యోగాలు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. జాగీరారుగారి బంగ్లా నివాసానికి యోగ్యమేకాని నా భోజనానికి మాత్రం చాల కష్టంగా ఉండేది. హోటళ్ళకు చాల దూరం. నా అవస్థ గమనించారు కాబోలు. ఆ ముస్లిం సోదరీమణులిద్దరూ "పేయింగ్ గెస్ట్" లాంటి ఏర్పాటు నొకదాన్ని సూచించారు. గది అద్దె, భోజనం, కాఫీ టిఫిన్లూ. అన్నీ కలిపి నెలకు నూటడెబ్బైఐదు రూపాయలు. ఆ ఏర్పాటు నాకూ నచ్చింది. నిన్న మొన్నటివరకూ జాగీర్దార్లు కావటంవల్ల భోజనంకాని. అతిధి మర్యాదగాని చాల పెద్ద షాయీలో ఉండేది. పరాయివాణ్ణి అనే భావం నాలో లేకుండా చేశారు. కొద్ది కాలంలోనే ఆ ఇంటి సభ్యుల్లో ఒకడినైపోయాను.

ప్రైవేట్ హాస్పిటలు కావటంవల్ల నాకు పని ఎక్కువగానే ఉండేది. ఉదయం పదకొండు గంటలవరకూ బయటనుంచి వచ్చే రోగుల్ని చూడాలి. పదకొండు నుంచి ఒంటిగంటవరకూ వార్డులో రోగులు, ఆపరేషన్లు, వారానికి నాలుగు రోజులు రాత్రి డ్యూటీ ఉంటుంది. ఎమర్జెన్సీ కాన్పులు లేకపోతే రాత్రివేళల్లో నాకు ఛాటియాగారి నల్లదబ్బంత విశ్రాంతి. డ్యూటీ మెడికల్ ఆఫీసర్ల గదిలో పడుకొని హాయిగా నిద్రపోతూ ఉండేవాణ్ణి.

ఆ రోజు ఔట్ పేషంట్సుని చూసివచ్చి

ప్రమాదీచ 1973 ఉగాది కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

వార్డులో కూర్చుని లాబొరెటరికి పంపవలసిన రిక్విజిషన్లమీద సంతకాలు పెడుతున్నారు.

"ఈ చీటీ చూడండి" అన్న స్వచ్ఛమైన తెలుగులో వినిపించిన మాటకు తలెత్తి చూశాను.

పరిశుభ్రంగా ఇంట్లో ఉతికిన చౌకరకం తెల్లవాయిలు చీరె కట్టుకొని ఉంది ఆ యువతి. నల్ల జాకెట్టు. వయస్సు ఇరవై రెండు–ఇరవై మూడు సంవత్సరాలలోపు ఉండవచ్చు. ఒక్క శరీర ఛాయ మినహాయిస్తే అపూర్వమైన ఆకర్షణ ఉంది ఆ అమ్మాయిలో. రంగుమాత్రం చామన చాయ. పూర్తి నెలలు నిండినట్లు ఉంది గర్భస్థ భారాన్ని మోస్తున్న అలసట విశాలమైన జాలి కళ్ళలో స్పష్టంగా కనిపిస్తూంది. చీటీ చూశాను. వార్డులో చేరటానికి వచ్చింది.

ఆ నర్సుకు చూపండి. అడ్మిట్ చేసి మీ మంచం చూపిస్తుంది" అన్నాను.

సాఫ్‌నర్సు కూర్చున్న టేబులు వేపు భారంగా అడుగులు వేసింది ఆ యువతి. నేను మళ్ళీ పనిలో మునిగిపోయాను. అయినా వాళ్ళ మాటలు నాకు వినిపిస్తూనే ఉన్నాయి.

"నామ్ బోలో?" స్టాఫ్ నర్సు అడుగుతూంది.

"పద్మ. నాకు తురకం తెలియదు" ఆ యువతి అన్నది.

నర్సు కూడా తెలుగావిడే. కృష్ణా జిల్లా నుంచి వచ్చింది. ఈ సారి తెలుగులోనే అడిగింది. "భర్త పేరు?"

"అందులో రాసిలేదా?" ఎదురు ప్రశ్న వేసింది ఆ యువతి.

స్టాఫ్‌నర్సు విసుక్కుంది. "ఉంటుంది. కాని ఆ రాసిన వాళ్ళే వచ్చి చదవాలి. అయినా ఈ కాలంలో కూడా అంత సిగ్గైతే ఎలా?"

"సిగ్గుకాదు. మళ్ళీ అబద్ధం చెప్పాలే అని...."

"అంటే?"

"నాకు భర్త లేడు."

చటుక్కున తలెత్తి చూశాను. భర్త లేకుండా గర్భవతి అయినందుకు ఆ యువతి సిగ్గుపడటంలేదు. ధైర్యంగా స్టాఫ్‌నర్సు కళ్ళలోకిచూస్తోంది. తెగింపులో వచ్చే ధైర్యం అది.

సాఫ్, మేక్ హర్ సిట్ కంఫర్టబ్లీ" అన్నాను.

"అలా కూర్చోండి" అన్నది స్టాఫ్ నర్సు స్టూలు చూపిస్తూ.

నిలబడి సమాధానాలు చెప్పటం యెంత కష్టంగా వుందో పాపం. కూర్చోమనగానే చటుక్కున కూర్చుని తేలిగ్గా ఊపిరి పీల్చింది ఆ యువతి.

"మొదటి కానుపా?" ఈసారి కాస్త మృదువుగా, సానుభూతి ధ్వనిస్తూన్న కంఠంతో అడిగింది స్టాఫ్ నర్సు.

"ఔను"

"పోనీ, తండ్రి పేరూ. అడ్రసూ చెప్పండి" వివరాలు అడ్మిషన్ రిజిస్టరులో రాస్తూ అడిగింది నర్సు.

"నాకు తల్లీదండ్రి ఎవరూ లేరు."

"దగ్గర బంధువులు? – ఎవరైనాసరే అడ్రసు చెప్పండి."

"నాకు ఎవరూ లేరు."

"ఆ వివరాలన్నీ లేనిదే అడ్మిట్ చేసుకోటానికి వీల్లేదు. రూల్సు వొప్పుకోవు. ఎట్లా?"

"చెప్పాను కదండీ. నాకెవరూ లేరని" ఈసారి ఆ యువతి కంఠంలో కొద్దిగా జీర వినిపించింది. బహుశా వచ్చే ఏడుపును బలవంతంగా ఆపుకోటానికి ప్రయత్నిస్తోందనుకొంటాను.

"చెప్పారు బాగానే ఉంది. కాని ఆపరేషను చెయ్యటానికి కన్సెంటు ఎవరిస్తారు? మీకేదైనా .... దురదృష్టవశాత్తూ .... ప్రమాదం జరిగితే మేము ఎవరికి తెలియజెయ్యాలి?"

"శవాన్ని తీసుకుపోవటానికేగా? ఐతే రాసుకోండి.... కేరాఫ్ మున్సిపల్ కార్పొరేషన్. హైదరాబాదు." అన్నదా యువతి.

స్టాఫ్ నర్సు తొట్రుపాటు పడుతూ "అహాఁ, ప్రమాదం జరుగుతుందని కాదు నా ఉద్దేశం .... రూల్సు ప్రకారం అడ్రసు ఉండాలి...." అన్నది.

నేను జోక్యం కలుగజేసుకొంటూ అన్నాను "ఆవిడ చెప్తూందికదా? ఎవరూ లేరని. ఎవరూలేనంత మాత్రాన అడ్మిషన్ నిరాకరించే అధికారం మనకులేదు. అడ్మిట్ చేసుకో."

"సరే. బెడ్ నెంబరు పద్దెనిమిది–వెళ్ళి పడుకోండి. వార్డుబోయ్ చూపిస్తాడు" అంటూ వార్‌బోయ్‌ని కేకవేసింది స్టాఫ్ నర్సు.

ఆ యువతి ఆయాసపడుతూ వార్డు బోయ్‌ని అనుసరించింది.

హఠాత్తుగా నాకొక సంఘటన గుర్తొచ్చింది. నేను ఈ హాస్పిటల్లో చేరిన కొద్ది రోజులకే జరిగిన దుస్సంఘటన అది.

....ఆ రాత్రి జోరున వర్షం కురుస్తూంది. నేను నైట్ డ్యూటీలో ఉన్నాను. ఇలాగే గర్భవతి అయిన ఒక అమ్మాయి వచ్చింది. పద్మ అనే ఈ యువతి చెప్పినట్లే ఆ అమ్మాయికూడా తనకెవరూ లేరని చెప్పింది. అదంతా అబద్ధమని తర్వాత తెలిసింది. ఆ అమ్మాయికి తల్లిదండ్రీ ఉన్నారు. కాస్తో కూస్తో ఉన్నవారే. ఎ. జీ. ఆఫీసులో ఉద్యోగం చేస్తూ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో ఉండేదట. ఎవరి వలలో పడిందో పాపం, గర్భం తెచ్చుకొంది.... పెళ్ళి కాకపోయినా స్నేహితురాళ్ళందరికీ పెళ్ళైందని అబద్ధం చెప్పింది. ఎక్కడో మూడు వందల మైళ్ళ దూరంలో ఉన్న తల్లిదండ్రులకు తెలియకుండా జాగ్రత్త పడింది. ఎవరు చెప్పారో ఏమోగాని గర్భం పోగొట్టుకోవాలని క్వినైన్ మాత్రలు మింగింది. గర్భమైతే పోలేదు కాని ప్రాణం పోయినంత పనైంది. బాధకు తట్టుకోలేకనో. ప్రాణంమీద తీపిచేతనో గాని ఎవరికీ చెప్పకుండా రిక్షాలో ఎక్కి హాస్పిటల్‌కు వచ్చేసింది.

రెండు గంటలు మృత్యువుతో పోరాడి ఎలాగైతేనేం ఆ అమ్మాయిని ప్రమాద స్థితిలొంచి బయట పడేశాను. గర్భం పోలేదు. మూడవ రోజుకల్లా లేచి తిరగ సాగింది. జరిగినదానికి సిగ్గుగాని, భవిష్యత్తును గూర్చిన విచారంగాని ఆ అమ్మాయిలో ఏ కోశానా కనిపించేవికావు. వార్డులో ఉన్న మిగతావాళ్ళందరితోనూ కలుపుగోలుతనంగా. నవ్వుతూ, కబుర్లు చెప్తూ తిరుగుతూండేది. పురుషులంటే అసహ్యం. సంఘమంటే నిర్లక్ష్య భావం ప్రదర్శిస్తూ తన పరిస్థితికి సంఘమే సిగ్గుపడాలిగాని


## గవర్నర్ సందేశం

"సత్‌సాహిత్యం ద్వారా సామాన్య ప్రజానీకానికి సాంఘిక విలువల విషయంలో శిక్షణ ఇవ్వటం నిజంగా ప్రోత్సహించదగిన ప్రయత్నం. ఉన్నతమైన నైతిక విలువలను ప్రతిపాదిస్తున్న "ధర్మవిజయం" ఉద్యమ కార్యకలాపాలు ఎంతో ప్రశంసనీయమైనవి. ఈ ఉద్యమం మన రాష్ట్రములో జయప్రదం కావాలని కోరుచున్నాను".

(సం) శ్రీ ఖండూబాయ్ దేశాయ్

శ్రీ వై. జి. రెడ్డిగార్కి,
"ధర్మవిజయం" కేంద్ర డైరెక్టర్,
పి. బి. నెం. 1654.
సికింద్రాబాదు–500003.

గవర్నర్ గారికి నచ్చిన మెచ్చిన ఈ మేటి ఉద్యమంలో నేడే చేరండి. ఉచిత సాహిత్యానికి పై విలాసమునకు వ్రాయండి.

(Kuchi)

# పద్మ నన్ను క్షమించింది !

తాను కాదన్నట్లు మాటల్లో వ్యక్తపరిచేది రేపు తనకు పుట్టబోయే బిడ్డను ధైర్యంతో పెంచి పెద్ద జేయగలదన్న నమ్మకం మా కందరికీ కలిగింది. కాని....నాలుగోరోజు రాత్రి పదకొండు గంటలకు ఐదో అంతస్థు నుండి కిందకి దూకి ఆత్మహత్య చేసుకొంది. ఆ సమయంలో నేనూ హాస్పిటల్లోనే వున్నాను. డాక్టర్లు, నర్సులు ఎంతమంది ఉంటేమాత్రం ఏం ప్రయోజనం? ఆ అమ్మాయిని బ్రతికించలేక పోయాం. కింది కాంక్రీట్ పేవ్‌మెంటు మీద పడిన మరుక్షణమే ప్రాణాలు విడిచేసింది. షాక్! తర్వాత తెలిసిన సంగతులు: రాత్రి డ్యూటీలోఉన్న నర్సును నిద్ర మాత్రలు కావాలని అడిగిందట! డాక్టరు ప్రిస్క్రిప్షను లేనిదే ఇవ్వటానికి వీల్లేదని ఆ నర్సు చెప్పిందట నిద్రపట్టని ఆ రాత్రి, భవిష్యత్తును గురించి ఎంత భయంకర మైన ఆలోచనలతో తల్లడిల్లిపోయిందో ఆ భగవంతునికే తెలియాలి!

ఈనాడు పద్మను చూడగానే బలవన్మరణం పొందిన ఆ అమ్మాయి నా కళ్ళ ముందు మెదిలి మనసంతా వికలమై పోయింది.

ఈ పద్మలోకూడా అదేవిధమైన నిర్లక్ష్య వైఖరీ, ఏ పరిస్థితినైనా ఎదిరించి నిలబడ గలనన్న ధీమా, సిగ్గుతో దాచిపెట్టుకోవలసిన విషయాలనుకూడా కసిగా బయట పెట్టే గుణం — నాకు తెలుసు — ఇవన్నీ పిరికి వాళ్ళ లక్షణాలు! తమలోని భయాన్నీ, నిస్సహాయతనూ కప్పిపెటుకోవటానికి వాళ్ళు తగిలించుకొనే ముసుగులు!

ఆ రోజు రౌండ్స్‌లో నేను పద్దెనిమిదో నెంబరు మంచం దగ్గరకు వెళ్ళగనే పద్మ గౌరవసూచకంగా లేచి నిలబడబోయింది. నేను వారిస్తూ "మీరిక్కడ పేషెంటు. డాక్టరు వచ్చినప్పుడల్లా లేచి నిలబడ నక్కరలేదు. పడుకోండి బ్లడ్ ప్రెషర్ చూస్తాను" అన్నాను.

రక్తపుపోటు మామూలుగానే ఉంది. అంతకు ముందు జరిపిన పరీక్షల తాలూకు రిపోర్టు అన్నీ చూశాను. బ్లడ్‌పిక్చర్ నార్మల్‌గా ఉంది. యూరిన్‌లో ఆల్బుమిన్ లేదు. ఆరోగ్యంగా ఉన్న శరీరమే. కాని బ్రీచ్ ప్రెజెంటేషను - ఆపరేషను చేసి బిడ్డను బయటకు తియ్యాల్సి ఉంటుంది.

"వంట్లో ఎలా ఉంటోంది?" అడిగాను

"బాధేమి లేదు. కొద్దిగా ఆయాసమనిపిస్తూంది" అన్నది పద్మ.

"గర్భవతులకు అది మామూలే లెండి, భయపడవలసిన విషయమేమి కాదు."

ఆ అమ్మాయి నీరసంగా నవ్వింది. డానిమ్మ గింజల్లాంటి పలువరస! "దేనికైనా బాధపడే స్థితి ఎప్పుడో మించిపోయింది. ఇప్పుడేం బాధలేదు. కాని నన్ను పరీక్షచేసిన డాక్టరమ్మ ఊరికే భయపెట్టేసింది! హాస్పిటల్లో చేరకపోతే ప్రమాదం అంటూ...."

"ఆవిడ మాట అబద్ధమని నేను అనటం లేదు. పిండం అడ్డం తిరిగి ఉన్నదన్న అనుమానంతో మిమ్మల్ని అడ్మిట్ చేసింది. ఇప్పుడిక మిరు భయపడనక్కర్లేదు" అన్నాను.

హఠాత్తుగా ఉద్విగ్నురాలైపోయింది పద్మ. "నా బ్రతుకే అడ్డం తిరిగింది. బ్రతుక్కి అడ్డం తిరిగి నేను బ్రతుకుతున్నాను ఇంకా నాకేం భయం?" అన్నది.... అని నిర్లక్ష్యంగా నవ్వింది.

ఆవిడ మానసిక స్థితి నాకు బాగా అర్థమైపోయింది. బ్రతుకంటే భయంతో అన్న మాటలు అవి. నేను ఊహించిన దానిలో పొరపాటేమి లేదు. ఐదో అంతస్థునుండి కిందికిదూకి ప్రాణాలు తీసుకొన్న యువతి ప్రవర్తనా, ఈ పద్మ ప్రవర్తనా ఒకే రకంగా ఉంది! ఈ అమ్మాయి జీవితం కూడా అలాగే అంతమవుతుందేమో?.... రకరకాలుగా పోయింది నా ఆలోచన.... అప్పటి కప్పుడే నేనొక నిశ్చయానికి వచ్చాను.

స్త్రీ సంక్షేమ శాఖలో పనిచేసే జాగిర్దారు గారి రెండవ అమ్మాయి చాల చలాకీపిల్ల. కాని తెలుగురాదు. నాకు ఉర్దూరాదు.... జానిస భాష ఇంగ్లీషే మా ఇద్దరికీ శరణ్యమైనది. మొదట ఆత్మహత్య గావించుకొన్న ఆ అమ్మాయిని గురించీ తరవాత పద్మను గురించి, పద్మకూడా అటువంటి ప్రమాదానికి లోనుగాకుండా రక్షించటానికి నేను వేసుకొన్న పథకం గురించీ చెప్పాను.




అంతా విన్నాక ఆ పిల్ల నాతో ఏకీభవించ లేదు.

అయినా నా పథకాన్ని అమలుపర్చడానికే నిశ్చయించుకొన్నాను

పద్మ హాస్పిటల్లో ఒంటరిగా ఉంటోంది. ఆ అమ్మాయిని చూట్టానికివచ్చే బంధువులుగాని, స్నేహితులుగాని ఎవరూ లేరు. పక్క మంచాలదగ్గర అరువు తెచ్చుకొన్న వారపత్రికలు చదువుతూ, అవి లేనప్పుడు మౌనంగా ఏదో ఆలోచిస్తూ కాలం గడిపేది.

"మీకిక్కడ సుఖంగా ఉంటూందా?" అని అడిగాను ఒకరోజున పద్మను.

"ఎప్పుడూ ఇక్కడే ఉంటే బావుండు ననిపిస్తోంది" అన్నది పద్మ. అది ఎగతాళో, మెచ్చుకోవాలో నాకు అర్థంకాలేదు.

"మీకు ఏవైనా బయట్నుంచి తెప్పించుకొని తినాలని ఉంటే చెప్పండి. నేను ఒక మనిషిని ఏర్పాటు చేస్తాను" అన్నాను.

"వీటితోనే కడుపు నిండిపోతోంది" అన్నది పద్మ లాకర్ మిద ఉన్న పాలూ, రొట్టె చూపిస్తూ.

మరో రోజు....

"డాకర్ సాబ్, నాకేదో పెద్ద ఆపరేషను చెయ్యాలట నిజమేనా?" అని అడిగింది పద్మ.

"ఎవరు చెప్పారు?"

"ఎవరైతేనేం లెండి. నిజమో కాదో చెప్పాలి మిరు."

"నిజమే కాని, ప్రమాదం కాదు."

"ప్రమాదం కాదా?" నిరాశతో అన్నట్టుగా ఉన్నాయి పద్మ మాటలు.

పద్మ యెడల నేను చూపించే ఆసక్తి వలన కాబోలు, నేనంటే కొత్తలో ఉన్న బెరుకూ, సంకోచమూ విడనాడి నాతో మనసు విప్పి మాట్లాడటం మొదలెట్టింది. మా ఇదరిమధ్యా చనువుతోపాటు ఒకవిధమైన ఆత్మీయతాభావం కూడా పెంపొందసాగింది. సాయంత్రం వేళల్లో తీరిక చిక్కినప్పుడెల్లా పద్మ మంచం దగ్గర కూర్చోవటం అలవాటైంది నాకు.

ఆ వేళ డిసెంబరు ఇరవై ఐదు.... క్రిస్టమస్. చాలామంది నర్సులు డే ఆఫ్ తీసుకొన్నారు. వార్డులో చాలా పనులు నేనే చేసుకోవలసివచ్చింది. ఆ పనులన్నీ చకచకా ముగించుకొని పద్మ మంచం దగ్గరికి వచ్చాను.

"డాక్టర్ సాబ్‌కి ఈ వేళ పని ఎక్కువైనట్లుంది." అన్నది పద్మ నవ్వుతూ.

"అందుకే హాయిగా గడిచిపోయింది. చేతినిండా పనిలేకపోతే మహా బోర్‌గా ఉంటుంది." స్టూలు లాక్కొని పద్మకు దగ్గిరగా కూర్చున్నాను. "నిన్న ఇంజెక్షను చేసిన చోట నొప్పి తగ్గిపోయిందా?"

"తగ్గింది. నా శరీరమంతా మందులతో నింపేస్తున్నారు. ఇక్కణ్ణుంచి నాకువిముక్తి ఎప్పుడు?"

పద్మ బాగా చదువుకున్నదై ఉండాలి. ఎంతో స్వచ్ఛంగా, క్లుప్తంగా ఉంటాయి ఆ అమ్మాయి మాటలు.

"మిమ్మల్నెప్పుడూ అడగాలనుకొంటూనే మర్చిపోతూ ఉంటాను. మీరేం చదువుకొన్నారు?" అని అడిగాను.

"ఏదోలేండి...." అన్నది పద్మ.

"అంటే?"

"కొద్ది చదువే—"

"మీకు సూటిగా సమాధానాలు చెప్పే అలవాటు లేదా ఏం?" నవ్వుతూ అడిగాను.

"ఇలా గుచ్చిగుచ్చి అడుగుతూ మీకు కావలసింది రాబట్టటం మీ డాక్టర్లకు బాగా అలవాటనుకొంటాను. బియ్యే చదివాను, సరేనా!" పద్మకూడా నవ్వుతూనే అంది.

"గ్రాడ్యుయేట్ కావటం కొద్ది చదువు కాబోలు?"

"కాదామరి? ఈ కాలంలో గ్రాడ్యుయేషనుకు విలువేముంది?"

"చదువుకొన్నారు. తెలివితేటలున్నాయి విచక్షణా జ్ఞానముంది. ఇవన్నీ ఉండికూడా మీరెందుకు తప్పటడుగు వేశారు?"

నేనా ప్రశ్న అడగ్గానే ఆవిడ ముఖంలో విషాద మేఘాలు ఆవరిస్తాయనుకొన్నాను. సిగ్గుతో ముఖం దించుకొంటుందనుకొన్నాను. కాని నా అంచనా తప్పింది. అవేవీ జరగలేదు. అదోరకంగా తమాషాగా నవ్వుతూ "మీరు తెలుగు సినిమాలు చూడరా?" అని అడిగింది.

ఆ ప్రశ్న ఎందుకు అడిగిందో అర్థం కాలేదు...."ఎందుకు చూడనూ? వారానికి ఐదారు చూస్తాను" అన్నాను.

"ప్రతి ఐదో సినిమాలోనూ నా కథ ఉంటుంది— మధ్యలో నిద్రపోకుండా చూస్తే"

"తమాషా కాదు. నేను సీరియస్‌గా అడుగుతున్నాను."

"నిజంగా వినాలని ఉందా?........ఐతే వినండి...." అంటూ చెప్పటం మొదలెట్టింది:

"మా నాన్నకు ఎనిమిదిమంది పిల్లలు. అంతా ఆడసంతానమే. ప్లీడరు గుమాస్తాలు బాగా డబ్బు సంపాదిస్తారని అంటారు కాని మా యింట్లో మాత్రం ఎప్పుడూ డబ్బుకు కటకటగానే ఉండేది. ఒక్కోరోజు నాన్న గారు వచ్చేవరకూ పొయ్యిలో పిల్లి లేచేది కాదు. నేనే అందరికన్నా పెద్దదాన్ని. మంచిరోజు లొస్తాయని ఆశతో నన్ను చదివించారు. నేను బియ్యే ఆఖరి సంవత్సరంలో ఉండగా నాన్నగారు పోయారు గుండెజబ్బుతో. ఎలాగో బి.యే పూర్తిచేశాను. సంసారం గడవక మేమంతా మేనమామ పంచన చేరాము. మామయ్య మాకోసం కాకపోయినా తన బాధ ఒదిలించుకోవాలన్న ఉద్దేశంతో చాలా ప్రయత్నాలు చేశాడు. కాని నాకెక్కడా ఉద్యోగం దొరకలేదు.

"ఆ సమయంలోనే నాకొకలా స్టూడెంటుతో పరిచయమైంది. మాకన్నా చాలా తక్కువ కులం. ఇక్కడే ఉస్మానియాలో చదువుతూండేవాడు. నన్ను పెళ్ళిచేసుకోవ

(మిగతా 54వ పేజీ చూడండి)


# టోషిబా పాప్యులారిటీ పోటీ

ఎంట్రీ ఫీజు లేదు - మీరు బహుమతిని గెలుపొందగలరు.

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

మొదటి బహుమతి: ఒక స్కూటరు వెస్పా లేక ఆల్విన్ ఫ్రిజిడేర్. 2 వ బహుమతి: ఒక టేపు రికార్డరు లేక ఆటోమాటిక్ కెమెరా లేక రేడియోగ్రాం. 3 వ బహుమతి: (100) టోషిబా జపాన్ మోడల్ 3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ ట్రాన్సిస్టర్లు ధర: రు. 275/–. 4 వ బహుమతి: (10) టోషిబా జూనియర్ జపాన్ మోడల్ 3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ ట్రాన్సిస్టర్ ధర: రు. 250/–.

## మీరు చేయవలసినది?

16 (పదహారు) నుంచి 31 (ముప్పది ఒకటి) వరకు గల అంకెలను నిలువుగా, అడ్డముగా, అయిమూలగా ఎటుకూడినా మొత్తము 94 (తొంబది నాలుగు) వచ్చునట్లు ఒక అంకెను ఒకేసారి ఉపయోగించి పై ఖాళీ గడులను పూరించవలయును.

ఎంట్రెన్స్ ఫీజు: ఎంట్రీ ఫీజు లేదు. ఇది ఒక పాప్యులారిటీ పోటీ మాత్రమే.

ఆఖరి పోస్టింగ్ తేదీ: 9-5-73. ఫలితం తేదీ: 12-5-73

సహాయము కొరకు 38, 2 నుంచి 17 అంకెలతో మొత్తముగల నమూనా.

| | | | |
|---|---|---|---|
| 13 | 3 | 16 | 6 |
| 4 | 8 | 15 | 11 |
| 14 | 10 | 5 | 9 |
| 7 | 17 | 2 | 12 |

పోటీకి నిబంధనలు: (1) సాదా కాగితము ఉపయోగించాలి. (2) సవరణలు, దిద్దులు, కటింగులుకల ఎంట్రీలు అంగీకరించబడవు. (3 ప్రమోటర్ల తీర్మానము ఖాయమైనది మరియు చట్టబద్ధముగా న్యాయమైనది. ఈ పోటీ విషయములో ఇది ఒక ముఖ్యమైన షరతు. (4) ఎంట్రీలయొక్క సక్రమము మా అఫిషియల్ సీల్డు సొల్యూషన్‌తో పరిపోల్చి ఖచ్చితముగా చూడబడును. నగదుగా బహుమతి ఇవ్వబడదు. (5) మొదటి బహుమతి: (1) అఫిషియల్ సొల్యూషన్‌తో సక్రమముగా వున్నట్లు కనుగొనబడిన దానికి ఇవ్వబడును. (6) రెండవ బహుమతి: (1) పైన అడ్డముగావున్న మూడు వరుసలలో సమానముగా వున్నదానికి ఇవ్వబడును. (7) మూడవ బహుమతి: (100) మా అఫిషియల్ సొల్యూషన్‌తో ఏ వరుసతోనైనా, సంఖ్యతోనైనా, సమానముగా వున్నదానికి ఇవ్వబడును. (8)నాల్గవ బహుమతి: డ్రాలో ప్రమోటరుకు సంతృప్తినిచ్చిన పది (10) ఎంట్రెంట్స్‌కు ఇవ్వబడును. (9) గెలుపొందిన వారికి సదరు బహుమతులు పొందుటకు పోస్టేజీ, ప్యాకింగ్, లైసెన్సు ఫీజు చెల్లించవలయును. (10) 3వ మరియు 4వ బహుమతి గెలుపొందినవారుకూడా పైన తెల్పిన ఖర్చులతో కూడా ట్రాన్సిస్టరు ఖరీదులో సగం చెల్లించాలి. మరియు మా నిబంధనలకు, షరతులకు లోబడి వుండాలి. (11) ఫలితములు పొందుటకు 45 పైసలు పోస్టలు స్టాంపులు పంపాలి. (12) ఒక కుటుంబము ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. (13) అడ్రసు ఇంగ్లీషు లేదా హిందీలో వ్రాయాలి. (14) కటింగ్ లేక నిబంధనల కాపీ భవిష్యత్తులో ఉపయోగార్థము ఉంచుకోండి. ఆఖరు తేదీని మార్చుకొనే హక్కు ప్రమోటర్లకు గలదు.

Controller Contest :

**FOREIGN AGENCIES (W—94)**

P. O. Box No. 1456. DELHI-6.

## పద్మ నన్ను క్షమించింది !

(15వ పేజి తరువాయి)

టానికి ఇష్టపడ్డాడు. మా అమ్మను చూచాయగా కదిలించి చూశాను. నాకు పెళ్ళికాలేదనే దిగులు ఎంతఉన్నా, కులంకాని వాణ్ణి పెళ్ళి చేసుకోవటానికి ఒప్పుకోదని అర్థమైంది. చాలా రోజులు ఆలోచించిన తర్వాత నా అంతట నేనే ఒక నిశ్చయానికి వచ్చాను. అతనితో కలిసి హైదరాబాద్ వచ్చేశాను. యాదగిరి గుట్టమీద రహస్యంగా పెళ్ళి చేసుకున్నాం. అప్పటివరకూ నా కన్యాత్వాన్ని పోగొట్టుకోలేదు.

"ఇసామియా బజార్లో ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకొన్నాం. ఆయన మంచివాడే. నన్ను ప్రేమగానే చూసుకొనేవాడు. నన్ను వదిలెయ్యాలనే దురుద్దేశం ఆయనకెప్పుడూ లేదనుకొంటాను....ఎందుకంటే ఇంట్లోకి కావలసిన సామానులు చిన్నవీ, పెద్దవీ ఎప్పుడూ కొంటూనే ఉండేవాడు. భవిష్యత్తును గురించి రంగు రంగుల కలలు కంటూ ఉండేవాడు. నేను కూడా ఆయన్ని ప్రేమించటం మొదలెట్టాను.

"ఉన్నట్టుండి ఒకరోజున వాళ్ళ ఊరి నుంచి వాళ్ళవాళ్ళంతా ఏడెనిమిదిమంది ఆడ, మగా కారులో వచ్చిపడ్డారు. హైదరాబాదు చూట్టానికి వచ్చారనుకున్నాను. వాళ్ళందరిక్కీ విందు భోజనాలు చేసి పెట్టలేక చాలా బాధపడ్డాను. ఆయన్ని బయటకు తీసుకెళ్ళి రెండు రోజులు ఏవేవో మంతనాలాడారు. ఆయన ఎందుకో చాల మానసిక ఆవేదన అనుభవిస్తున్నాడని గ్రహించాను. నాతో ఏదో చెప్పాలనీ, అది చెప్పలేక బాధపడుతున్నాడనీ నాకు అర్థమైంది....వచ్చిన వాళ్ళలో ఒక ముసలాయన నన్ను ఎంతో ప్రేమగా పలకరిస్తూ, తియని మాటల్లో కొన్ని విషయాలు చెప్పాడు. ఆయనకు పెళ్ళికాని చెల్లెలు ఒకామె ఉందట. ఈయన చేసిన "పని" వల్ల ఆ అమ్మాయికి పెళ్ళి కాలేదట. పెద్దవాళ్ళు కుదిర్చిన ఒకమ్మాయిని ఈయనగారు చేసుకొంటే, ఈయనగారి చెల్లెల్ని ఆ అమ్మాయి అన్నగారు చేసుకుంటారట. బార్టర్ సిస్టం! ఇదీ ఆ ముసలతను చెప్పిన మాటల సారాంశం!"

"ఈ సమస్య పరిష్కారం కావాలంటే అక్కడ ఆయన చెల్లెలి జీవితమో, ఇక్కడ నా జీవితమో నాశనం కావాలి. నాలో ఉన్న మెత్తదనాన్ని చూసి కాబోలు వచ్చిన వాళ్ళంతా, నాచేత చేయించుకొంటూనే, నా సానుభూతిమీద దాడి చెయ్యటం మొదలెట్టారు జాలిగొలిపే మాటలతో. చివరకు నన్నే లొంగదీశారు. వచ్చినవాళ్ళంతా నా అంత త్యాగమూర్తి ఈ ప్రపంచంలో ఎక్కడాలేదన్నట్టు మాట్లాడారు. నేను లొంగకపోయినా ఏదోవిధంగా ఆయన్ని తీసుకవెళ్ళిపోయేవారే ననుకొంటాను.

వాళ్ళంతా ఆయన్ని కార్లో ఎక్కించుకొని పోతూఉంటే, అచంచలమైన భక్తి విశ్వాసాలతో ఎవరిముందైతే మేమిద్దరం భార్యాభర్తలమయ్యామో ఆ భగవంతుడు కూడా చూస్తూనే ఊరుకున్నాడు. ఆయన వెళ్ళాక చూస్తే, మేము మామూలుగా చిల్లర డబ్బులు వేసుకొనే బిస్కట్ల డబ్బాలో పది వంద రూపాయల నోట్లుకనిపించాయి. అదీ కథ! దానితో మా ఇద్దరి మధ్యావున్న దేహార్ధ సంబంధమే కాక అర్ధాత్ర సంబంధం కూడా తెగిపోయిందన్నమాట! తర్వాత కొద్దిరోజులకే ఆయన పెళ్ళి చేసుకోబోతున్నట్టు శుభలేఖ కూడా పంపారు. ఎంత హృదయంలేని మనుషులో చూసారా?"

"పాపం, అతను చాలా దురదృష్టవంతుడు!" అన్నాను నేను.

"దురదృష్టవంతుడు అతనా! నేను కాదా?" పద్మ అడిగింది.

"కాదు. మిలాంటి మాణిక్యాన్ని చేజేతులా పోగొట్టుకున్న అతడే దౌర్భాగ్యుడు నా దృష్టిలో."

నా మాటల్లో సిన్సియారిటి ఉందోలేదోనని కాబోలు, ఒక్కక్షణంపాటు నాకళ్ళలోకి సూటిగా చూసింది పద్మ. తర్వాత ముఖం పక్కకు తిప్పుకొంటూ "మీరేమనుకొంటున్నారోగాని నేనంతటి అదృష్టవంతురాలిని కాదు" అన్నది.

"ఎందుక్కాదు?....సరే పోనివ్వండి. నేనొక ప్రశ్న అడుగుతాను. సూటిగా ఔననో కాదనో సమాధాన మిస్తారా?"

"అడిగి చూడండి" అన్నది పద్మ నవ్వి.

"మీకు....ఇష్టమైతే నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకొంటాను" అన్నాను.

పద్మ కలలోకూడా ఊహించని మాటలు కాబోలు అవి. త్వరత్వరగా చాల రంగులు మారాయి ఆ అమ్మాయి ముఖంలో. తర్వాత సిగ్గుతో ముఖం దించుకొంది.

బికాంప్లెక్స్ టానిక్ కంటే, ఐరన్ మాత్రలకంటే నా మాత్రలే పద్మమీద చాలా బాగా పని చేశాయనుకొంటాను. అప్పట్నుంచీ ఆవిడలో మార్పు చాలా త్వరత్వరగా రావటం మొదలెట్టింది. కళ్ళలోకి కొత్త వెలుగు వచ్చింది. కళ్ళకింద నీలినీడలు మాయమయ్యాయి. పక్క మంచాలమీద స్త్రీలతో నవ్వుతూ, తుళ్లుతూ కబుర్లు చెప్పటం మొదలెట్టింది. నాతో మాట్లాడేప్పుడు రవంత సిగ్గూ, కాస్త చిలిపితనం కలిపి మాట్లాడటం సాగించింది.

ఒకరోజు బత్తాయిపళ్లు కావాలన్నది. వార్డు బోయ్‌చేత తెప్పించాను. డబ్బు ఇవ్వబోయింది. నేను తీసుకోలేదు.

"అదేం?" అంటూ అటూ ఇటూ చూసి ఎవరూ వినటం లేదని నిర్ధారణ చేసుకొన్న తర్వాత "మనమింకా మొగుడూ, పెళ్ళాం కాలేదుగా?" అన్నది చిలిపిగా.

ఎందుకోగాని జాగీర్దారుగారి రెండో అమ్మాయికి పద్మ అంటే అమితమైన ఆసక్తి ఏర్పడింది. "ఆ అమ్మాయిని నాకు పరిచయం చెయ్యగలరా?" అని అడిగింది చాలాసార్లు. ఒంటరిగా ఉంటోన్న పద్మకు కాస్త ఊరటగా ఉంటుందని "సరే" అన్నాను.

ఆ సాయంకాలమే వచ్చింది ఆ పిల్ల—బుట్టనిండా ద్రాక్ష, యాపిల్స్ తీసుకొని. పరిచయం చేశాను. కొంచెంసేపట్లోనే ఇద్దరికీ బాగా స్నేహం కలిసింది. ఇంగ్లీషు, ఉర్దూ కలిసిన మిశ్రమభాషలో చాలాసేపు కబుర్లు చెప్పుకున్నారు. నవ్వుకొన్నారు. ఆ అమ్మాయి వెళ్ళిపోయాక పద్మ అడిగింది. "వాళ్ళఇల్లు చాల పెద్దదటగా?మనంఅక్కడే ఉండవచ్చుకదూ?"

నేను నవ్వాను. "మీ ఇద్దరికీ బాగా స్నేహం కుదిరినట్లుంది."

'చాల మంచిపిల్లండీ' అన్నది పద్మ.


నోటీసు

ది ఆంధ్రప్రదేశ్ పోలీసు వెల్ఫేరు ఫండ్ రాఫిల్

పై రాఫిల్‌కు 25-3-1973న జరగవలసిన డ్రా అనివార్య కారణాల వలన వాయిదా వేయబడినది.

ది ఆంధ్రప్రదేశ్ పోలీసు వెల్ఫేర్ ఫండ్ రాఫిల్ కమిటీ

పద్మకు రాత్రి ఒంటిగంటకు నొప్పులు రావటం మొదలెట్టాయి. నైట్ డ్యూటీలో ఉన్న నాకు వార్డునుంచి మెమో వచ్చింది. నిద్రపోతున్న నేను గబగబా బట్టలు వేసుకుని వచ్చి పద్మను పరీక్షచేశాను. థియేటరు సిద్ధం చెయ్యమని స్టాఫ్‌నర్సుకు చెప్పి చీఫ్‌కు ఫోన్‌చేశాను. పద్మకు సిజేరియన్ చెయ్యాలి.

తెరలు తెరలుగా పద్మకు నొప్పులొస్తున్నాయి. ఓపికగా పద్మ మంచం పక్కనే కూర్చుని నొప్పిరాని సమయంలో అన్నాను. "చూడు పద్మా, నీకు ఆపరేషను చెయ్యాలి. ఇక ముందు కూడ కానుపు వచ్చిన ప్రతిసారీ ఆపరేషను చేసి బిడ్డను బయటికి తియ్యాల్సి ఉంటుంది. అందుకని పెద్ద డాక్టరమ్మగారూ, నేనూ కూడ పనిలోపనిగా ఇప్పుడే పిల్లలు పుట్టకుండా ఆపరేషను చెయ్యాలని నిశ్చయించుకొన్నాం. దానికి నీ అంగీకారం కావాలి" అన్నాను.

పద్మ నుదుట పట్టిన చెమటను తుడుచుకొంటూ "మీకిష్టమైతే...నాకూ ఇష్టమే..." అన్నది. అంతలోనే మళ్ళీ నొప్పులు ప్రారంభమయ్యాయి. పిడికిళ్ళు బిగబట్టి మెలికలు తిరిగిపోతూ బాధ అణుచుకోవటానికి ఎంతో ప్రయాస పడసాగింది.

పద్మను స్ట్రెచర్‌లో థియేటరుకు పంపమని చెప్పి నేను అక్కడకు వెళ్ళేసరికి మా ఛీఫ్ కూడా వచ్చి ఉంది. "డాక్టర్, డిడ్ షి కన్సెంట్ ఫర్ స్టెరిలైజేషన్ ఆల్సో?" అని అడిగింది.

నేను తలూపి చేతులు కడుక్కోవటం మొదలెట్టాను.

పద్మను ఆపరేషన్ టేబులు మీద పడుకోబెట్టి మాస్కు కట్టబోయేముందు నా చేతిని గట్టిగా పట్టుకొని "డాక్టర్‌సాబ్ నేను బ్రతుకుతానా? ప్లీజ్.... నన్ను చావనీయకండి!" అన్నది.

చావు బ్రతుకుల మధ్య ఎడతెగని పోరాటం నాకేమీ కొత్తగాదు. కాని దుఃఖభరితమైన జీవితం అనుభవిస్తున్న పద్మలో కూడా ఇంతటి జీవితేచ్ఛ ఉండటం చూసేసరికి నా మనస్సు ఎలాగో అయిపోయింది. పద్మకు ధైర్యం చెప్పి అనెస్థటిస్ట్‌కు సైగ చేశాను. పద్మ మత్తులోకి జారిపోయింది.

పద్మకు పాప పుట్టింది. తెల్లగా, బొద్దుగా—మాకే ఆశ్చర్యం కొలిపేటంత బరువుగా, ఆరోగ్యంగా ఉంది పాప.

పద్మను డిశ్చార్జి చేసేరోజు దగ్గరపడుతున్నకొద్దీ నాలో ఆందోళన పెరగసాగింది హాస్పిటల్లో అప్పటికే నాగురించీ, పద్మను గురించీ రకరకాల పుకార్లు లేచాయి. ఆ రోజు జాగీర్దారుగారి రెండో అమ్మాయికీ నాకూ మంచి వాదన జరిగింది. నేనాడుతున్న నాటకం మంచిది కాదంటుంది ఆ పిల్ల. నన్ను నేను సమర్థించుకోటానికి చాలా ప్రయత్నించాను.

"మీరెన్నయినా చెప్పండి. ఫలించవని తెలిసికూడా ఒకయువతి మనసులో ఆశలు రేపటం మహాఘోరం. ఆశ రేపి మోసం చేయటాన్ని ఏ యువతీ క్షమించదు!" అన్నది.

"నేనెందుకు ఇలా చేస్తున్నానో చెప్పానుగా. నిరాశా నిస్పృహలనుండి పద్మ మనస్సు మళ్ళించటమే నా ఉద్దేశం. యీ ప్రయోగంలో నేను సత్ఫలితాలనే పొందుతానని నాకు నమ్మకముంది" అన్నాను.

"నాకు మాత్రం అలా అనిపించటం లేదు" అన్నాను.

హాస్పిటల్లో పద్మ చాలా త్వరగా కోలుకొంటూంది. నాలుగు రోజులు గడిచాక "పద్మా నిన్ను రేపు డిశ్చార్జి చెయ్యబోతున్నాను" అన్నాను.

'బ్రతికించారు. ఇక్కణ్ణుంచి ఎప్పుడు బయటపడదామా అనిపిస్తూంది. నన్నెక్కడికి తీసుకెళ్తారు? జాగీర్దారు గారింటికేనా?' అని అడిగింది పద్మ.

నేను వెంటనే సమాధానమివ్వలేక పోయాను. అదృష్టవశాత్తు దగ్గరలో ఎవరూలేరు. వరసగా నాలుగు మంచాలు ఖాళీ. మెల్లగా స్టూలుమీద కూలబడ్డాను.

"జాగీర్దారుగారిల్లు బాగానే ఉంటుందటగా?" మళ్ళీ పద్మే అడిగింది. పద్మనన్ను గురించీ, నేనుండే ఇంటిని గురించీ చాలా వివరాలు సేకరించిందన్న మాట!

"నన్ను క్షమించు పద్మా!" అన్నాను.

"ఎందుకూ?" పక్కలో నిద్రపోతోన్న పాప ముంగురులను సవరిస్తూ పద్మ అడిగింది.

"నిన్ను పెళ్ళి చేసుకోవాలన్న ఉద్దేశం నాకులేదు. నువ్వేదైనాఅఘాయిత్యానికి తలపడతావేమోనని.... నేనలా....ఈ నాటకం ఆడవలసి వచ్చింది. నిండు ప్రాణాలు నిలువునా తీసుకొన్న నీ లాంటి యువతినే నేనిక్కడ చూశాను.... ఆ దృశ్యం నాకెప్పుడూ గుర్తొస్తూ ఉంటుంది...."

పద్మ తెల్లబోయింది. కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. కోపంతో వణికిపోతున్న పెదవులనూ, పొర్లివస్తున్న ఏడుపునూ అదుపులో పెట్టుకోవాలన్న వ్యర్థప్రయత్నంచేస్తూ "మీరు....మీరు.... మీకసలు హృదయమే లేదు. నా వంటి నిర్భాగ్యులతో ఆటలాడుకోవటమే మీ సరదా. మీలాంటి వాళ్ళను నిలువునా—" ఆగిపోయింది పద్మ.

అప్పటివరకూ తల్లిపక్కలో ప్రశాంతంగా నిద్రపోతున్న పాప ఉలికిపడిలేచి



"ఉగాది పచ్చడి"

చిత్రం : వై. బాలయ్య, సిద్ధిపేట

గుక్కపట్టి ఏడవటం మొదలెట్టింది. పద్మ ఆతృతగా పాపను చేతుల్లోకి తీసుకొని జాకెటు గుండీలు తొలగించి ఒక రొమ్ము పాపనోటికి అందించింది, ఆత్రంగా పొట్ట నింపుకొంటూన్న ఆ పసిపాప వీపు నిమురుతూ మధురానుభూతిలో మునిగిపోయింది. నేనక్కడఉన్న సంగతికూడా మర్చిపోయిందనుకొంటాను. కేవలం ఒకే ఒక క్షణం కింద పద్మ కళ్ళలో చిందులాడిన క్రోధాగ్ని జ్వాలలు మంత్రించినట్లు మాయమైపోయాయి. ఇప్పుడా కళ్ళలో ప్రేమానురాగాలు నిండి ఉన్నాయి.

అత్యంత కమనీయమైన భగవంతుని సృష్టివైపరీత్యాన్ని చూస్తూ పరవశించిపోయాను నేను.

చాలాసేపటికి పద్మ తలెత్తి నిరుద్వేగమైన దృక్కులతో నావేపు చూస్తూ "పాపను చూడండి. దీని చిన్న పొట్టకు అప్పుడే ఎంత ఆకలో!" అన్నది.

పద్మ నన్ను క్షమించింది! ★